నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూపులు

- నెలకు రూ.3వేలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం
- అధికారంలోకి వచ్చి నెల దాటినా స్పష్టత ఇవ్వని వైనం
- గతంలోనూ మొండిచేయి చూపిన చంద్రబాబు
- మళ్లీ అదే పునరావృతమవుతుందని సందేహం



కూటమి సూపర్-6 హామీల్లో మొట్టమొదటి ప్రాధాన్యత అయిన 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి

జగ్గయ్యపేట / కంచికచర్ల: ఎన్నికల సమయంలో టీడీపీ కూటమి ఇచ్చిన జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి హామీని సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఎప్పుడు అమలు చేస్తుందా? అని జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లోని నిరుద్యోగ యువత ఆశగా ఎదురుచూస్తోంది. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ప్రతి కుటుంబంలోని నిరుద్యోగ యువతీయువకులందరికీ ఉద్యోగావకాశాలు కల్పిస్తామని, లేకుంటే నెలకు మూడు వేలు చొప్పున నిరుద్యోగ భృతి అందిస్తామని కూటమి నాయకులు ప్రకటించారు. అయితే కూటమి ప్రభుత్వంలోకి వచ్చి రెండోనెల జరుగుతుండటంతో ఈ పథకం అమలు ఎప్పటి నుంచి చేస్తారోననే ప్రకటన కోసం నిరుద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్నారు. జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లో సుమారు లక్షకుపైగా కుటుంబాలు దారిద్ర్యరేఖకు దిగువన ఉంటాయి. ఈ కుటుంబాల్లోని నిరుద్యోగులు, నిరుద్యోగ భృతికి అర్హులే. ఆయా కుటుంబాల్లోని యువతీయువకులు ఈ పథకం కింద నెలకు మూడు వేలు చొప్పున నిరుద్యోగ భృతి ఎప్పుడు వస్తుందా? అని ఎదురు చూస్తున్నారు.

భృతి పేరుతో గతంలో మోసం..

2014లో అధికారాన్ని చేపట్టిన చంద్రబాబు ప్రభుత్వం నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతిని అందిస్తామని ఎంతో ఆర్భాటంగా ప్రకటించింది. ఆ తరువాత నాలుగున్నరేళ్లుగా చంద్రబాబు ఈ పథకం ఊసే ఎత్తిన పాపాన పోలేదు. 2019 ఎన్నికలకు కొద్ది నెలలు ముందుగా ఒక్కో నియోజకవర్గంలో వేలాది మంది నిరుద్యోగులు ఉంటే, మండలానికి ఓ వెయ్యి మందికి కూడా నిరుద్యోగభృతి ఇవ్వని వైనాన్ని పలువురు నిరుద్యోగులు గుర్తుచేసుకుంటూ ఈసారి కూడా అదేపరిస్థితి తప్పదేమోనని నిరాశ చెందుతున్నారు. గత పాలనలో నిరుద్యోగ భృతి ఇవ్వకుండా మోసం చేసిన చంద్రబాబు ఈసారి కూడా ఇప్పటివరకూ ఎటువంటి ప్రకటన చేయకపోవడంపై పాత రోజులను గుర్తుచేసుకుంటున్నారు.

వేలాది మందికి కొలువులు..

2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాలకు చెందిన వెయ్యిమందికిపైగా యువతకు శాశ్వత కొలువులు వచ్చాయి. ముఖ్యంగా సచివాలయాల కార్యదర్శుల పోస్టులకు అధికశాతం మంది ఎంపికకగా, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ప్రైవేట్ ఉద్యోగాల్లో వేలాది మందికి అవకాశాలు లభించాయి. జగ్గయ్యపేట నియోజకవర్గం పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు గ్రామానికి చెందిన 30మందికిపైగా యువతీయువకులు గ్రామసచివాలయాల్లో కార్యదర్శులుగా ప్రభుత్వోద్యోగాలకు ఎంపికకావడం గమనార్హం. ఇదిలా ఉండగా ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికల సమయంలో ఇచ్చిన నిరుద్యోగ భృతి హామిని ఎప్పటి నుంచి అమలుచేస్తారనే అంశంపై సీఎం చంద్రబాబు స్పష్టమైన ప్రకటన చేయడంతోపాటు తమకు త్వరితగతిన నిరుద్యోగ భృతిని అందించాలని యువతీయువకులు కోరు తున్నారు. ఆ అభిప్రాయాలు..వారి మాటల్లోనే..

ఉద్యోగం నుంచి తొలగింపజేశారు...



చిల్లకల్లులోని పాలశీతలీ కేంద్రంలో పనిచేస్తుంగా వైఎస్సార్‌సీపీకి చెందిన వాడినంటూ టీడీపీ నాయకులు గత ఏప్రిల్‌లో విజయ పాలకేంద్రం యాజమాన్యానికి ఫిర్యాదు చేసి ఉద్యోగం నుంచి తొలగింపజేశారు. మూడు నెలలుగా ఖాళీగా ఉంటున్నాను. నిరుద్యోగ భృతి ఇస్తే మేలు చేకూరుతుంది.

– అరవ నాని, గౌరవరం, జగ్గయ్యపేట మండలం

నిరుద్యోగ భృతి ఇవ్వాలి...



నేను డిగ్రీలో బీకాం పూర్తి చేశారు. పలు ప్రైయివేటు కంపెనీల్లో పని చేశాను. ఇటీవల విజయవాడలో నేను కంపెనీ మూసివేయడంతో ఖాళీగా ఉంటున్నాను. నిరుద్యోగ భృతి ఇస్తే ఉద్యోగం వచ్చేవరకు ఎంతో కొంత వెసులుబాటు ఉంటుంది.

– మీసాల రాజా, గౌరవరం, జగ్గయ్యపేట మండలం

ఉద్యోగావకాశం కల్పించాలి..



నేను డిగ్రీ పూర్తిచేసి ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాను. గత సార్వత్రిక ఎన్నికలలో భాగంగా నిరుద్యోగులకు ఇచ్చిన ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగభృతి అందిస్తామన్న హామీని ప్రభుత్వం అమలు చేయాలి.

– కె.గోపి మక్కపేట,

నిరుద్యోగ భృతి ఇచ్చి అండగా నిలవాలి



ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలతోపాటు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను కూడా వెంటనే నేరవేర్చాలి. ఉద్యోగం లేని యువతకు నిరుద్యోగ భృతి ఇచ్చి ఆదుకోవాలి.

– పి.రాము, వత్సవాయి.

జాబ్ క్యాలెండర్ ఇస్తే మేలు...



ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం జాబ్ క్యాలెండర్ ప్రకటించి, ఉద్యోగావకాశాలు కల్పిస్తే మాలాంటి యువతీయువకులకు ఎంతో మేలు కలుగుతుంది. ఉద్యోగం వచ్చే వరకు ప్రభుత్వం నిరుద్యోగభృతి ఇచ్చి ఆర్థికంగా భరోసా కల్పించాలి.

– వేల్పుల రాము, పెనుగంచిప్రోలు

ఇబ్బంది లేకుండా చూడాలి...



మేనిఫెస్టోలో చెప్పిన విధంగా జాబ్ క్యాలెండర్ కోసం నిరుద్యోగులం ఎదురు చూస్తున్నాం. ఉద్యోగం పొందేవరకు ఆర్థిక ఇబ్బంది లేకుండా ప్రభుత్వం ఇస్తానన్న రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తే భరోసాగా ఉంటుంది.

– గొర్రెపాటి రంజిత్‌కుమార్, కె.పొన్నవరం

హామీని అమలు చేయాలి...



ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నిరుద్యోగులకు రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని టీడీపీ కూటమి నాయకులు హామీ ఇచ్చారు. హామీని అమలుచేసి ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగులకు భృతి ఇవ్వాలి.

– బి.ప్రత్యూష, గండేపల్లి, కంచికచర్ల మండలం

క్లుప్తంగా

గోరింటాకు మహోత్సవం



ధర్మవరప్పాడుతండ(జగ్గయ్యపేట): ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని జగ్గయ్యపేట మండలంలోని ధర్మవరప్పాడుతండ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం గోరింటాకు మహోత్సవం నిర్వహించారు. విద్యార్థినులు గోరింటాకు పెట్టుకుని సందడి చేశారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఆషాఢమాసంలో గోరింటాకు ఉన్న ప్రాముఖ్యతను వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి సోమవారం నందిగామ పట్టణానికి చెందిన కమతం వెంకటేశ్వరరావు, సరిత దంపతులు రూ.11,100లను విరాళంగా ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

విధులు బహిష్కరించి న్యాయవాదుల నిరసన



కంచికచర్ల : సమస్యలను కోర్టుల ద్వారా పరిష్కరించుకోవాలేగాని న్యాయవాదులపై దాడులు చేయడం బాధాకరమని నందిగామ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నండ్రు బాబూ విద్యాసాగర్ అన్నారు. ఇటీవల బెజవాడ బార్ అసోసియేసన్ సభ్యులపై కొంతమంది దుండగులు దాడిచేయడాన్ని నిరసిస్తూ సోమవారం నందిగామ కోర్టు వద్ద న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన ప్రదర్శన చేశారు. న్యాయవాదులపై దాడికి పాల్పడినవారిని శిక్షించడంతోపాటు న్యాయవాదులకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఎక్కిరాల హనుమంతరావు, సీనియర్ న్యాయవాదులు షేక్ కరీముల్లా, పీవీ రంగారావు, సీహెచ్ రవికుమార్, బి. భాస్కరరావు, ఎం స్టాలిన్, కే మౌలేశ్వరరావు, టి.కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలాల పెంపు సామాజిక బాధ్యత

ఎమ్మెల్యే సౌమ్య


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తదితరులు

కంచికచర్ల : వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపును ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తించాలని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పిలుపునిచ్చారు. నందిగామలో 'ఇంకుడు గుంతలకు ప్రాధాన్యత ఇవ్వండి–భావితరాలకు నీరు అందించండి' అనే నినాదంతో జిల్లా పర్యావరణ పరిరక్షణ సమితి ముద్రించిన కరపత్రాలను సోమవారం ఆమె ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ వర్షపునీటిని ఒడిసి పట్టేందుకు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. ప్రతి ఇల్లు, ఆపార్ట్‌మెంట్, కార్యాలయాలు, పరిశ్రమ ఆవరణలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు సూచించారు.కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ సమితి నాయకులు ఆర్. శ్రీధర్, కె.రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు సంఘీభావం



బూదవాడ(జగ్గయ్యపేట): అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారం పేలుడు ప్రమాదంలో మృతి చెందినవారి కుటుంబాలకు ప్రజాసంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. మృతులు ఆవుల వెంకటేష్, బాణావత్ స్వామి నాయక్, పరిటాల అర్జున్‌రావు కుటుంబాలను సంఘాల నాయకులు సోమవారం పరామర్శించి మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ కర్మాగార యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందన్నారు. కార్మికులకు పూర్తి భద్రత కల్పించాల్సిన యాజమాన్యం ఆ దిశగా చర్యలు తీసుకోలేదన్నారు. కర్మాగార యాజమాన్యంపై హత్య కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు సోమోజు నాగమణి, జిల్లా కార్యదర్శి కమల, సీఐటీయూ నాయకులు గౌస్‌మియా, రామనాథం, సోమేశ్వరరావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి నలుగురు విద్యార్థినులు ఎంపిక


మాతంగి కీర్తనభాయి


గుంటూరు రాజ్యలక్ష్మి


చీకటిమళ్ల కావ్య


మల్లెల షాన్‌జూలీ

వత్సవాయి : గతేడాది పదోతరగతి పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన తమ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించినట్లు వత్సవాయి జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.ఆశోక్‌కుమార్ సోమవారం తెలిపారు. వీరిలో మాతంగి కీర్తనబాయి, గుంటూరు రాజ్యలక్ష్మి(నూజివీడు) చీకటిమళ్ల కావ్య, మల్లెల షాన్‌జూలీ(ఒంగోలు) ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. ఈసందర్భంగా విద్యార్థినులు, వారి తల్లిదండ్రులను పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్, గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు.

సారె సమర్పించిన 43 భక్త బృందాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు సోమవారం 43 బృందాలు ఆషాఢ సారెను సమర్పించాయి. నూజివీడుకు చెందిన దుర్గ బృందంకు చెందిన 35 మంది, గుంటూరుకు చెందిన బాలాజీ సేవా బృందంకు చెందిన 50 మంది, సాయినంద భక్తి బృందంకు చెందిన 60 మంది, ఉండవల్లి సెంటర్‌కు చెందిన టి.శ్రీలక్ష్మీ బృందంకు చెందిన 50 మంది, శ్రీమారుతీ లలితా మండలికి చెందిన 40 మంది, శ్రీరామ భక్త బృందంకు చెందిన 35 మంది, సింగ్‌నగర్‌కు చెందిన కె. మల్లికార్జునరావు బృందంకు చెందిన 45 మంది, రామకృష్ణ కోలాట సంఘంకు చెందిన మరో 30 మంది, గుడివాడకు చెందిన మురళీకృష్ణ కోలాట బృందం తదితర భక్తబృందాలు అమ్మవారికి సారెను సమర్పించాయి.

కేవీకే సర్ణోత్సవ వేడుకలు


వ్యవసాయి పంచాంగం పుస్తకాలను పంపిణీ చేస్తున్న కేవీకే ఆర్డినేటర్ కృష్ణంరాజు

మక్కపేట(వత్సవాయి): గరికపాడు కృషి విజ్ఞానకేంద్రం(కేవీకే) స్వర్ణోత్సవ వేడుకలను మక్కపేటలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేవీకే కోఆర్డినేటర్ కృష్ణంరాజు మాట్లాడుతూ కేవీకేలు 50ఏళ్లుగా రైతులకు అనేక సేవలందిస్తూ వారి అభ్యున్నతికి దోహదపడుతున్నాయన్నారు. రైతులు, కేవీకేలతో అనుసంధానమై పనిచేస్తూ వ్యవసాయంలో మంచి దిగుబడులు సాధిస్తున్నారని వివరించారు. శాస్త్రవేత్త పీఎస్ శివప్రసాద్ మాట్లాడుతూ సేద్య విభాగం జీవన ఎరువులు ప్రాముఖ్యతను వివరించారు. కె.లక్ష్మి మాట్లాడుతూ మిర్చి నర్సరీల నిర్వహణ, మిరపసాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఆర్.ప్రభావతి, టి.జశ్వంత్‌రెడ్డి మాట్లాడుతూ చిరుధాన్యాలు, వర్షాకాలంలో పశుపోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం రైతులకు వ్యవసాయ పంచాగం పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉద్యానవిభాగ ఉద్యోగి దివ్య, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై డ్రైవర్లకు అవగాహన



కంచికచర్ల : వాహనదారులు డ్రైవింగ్‌పై నైపుణ్యం కలిగి ఉంటేనే ప్రమాదాలసంఖ్య తగ్గుతుందని రవాణాశాఖ ఉద్యోగుల సంఘ జోనల్ అధ్యక్షుడు ఎం.రాజబాబు పేర్కొన్నారు. కంచికచర్ల అన్నపూర్ణ హెవీ మోటార్ డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పొందుతున్నవారికి రోడ్‌భద్రతపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా రాజబాబు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు తగ్గించే దిశగా రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు. రోడ్డు భద్రతపై తీసుకోవలసిన జాగ్రత్తలపై వారికి అవగాహన కల్పించారు. అనంతరం రాజబాబును స్కూల్ యాజమాన్యం సత్కరించింది. కార్యక్రమంలో డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులు బి.నారాయణరావు, ప్రిన్సిపల్ సీహెచ్ రామారావు శిక్షకుడు ఎ.ప్రేమ్‌చంద్ పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు అవగాహన ..

వీరులపాడు: వాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ మహాలక్ష్మణుడు హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆటోడ్రైవర్లకు సోమవారం ఆయన ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించాలన్నారు. ముఖ్యంగా పరిమితికి మించి ప్రయాణికులతో ప్రయాణం ప్రమాదకరమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పరిమితికి మించిన ప్రయాణికులతో వెళ్తున్న ఆటోలను గుర్తించి జరిమానా విధించారు.

డాక్టర్ కేల్ రావు చిరస్మరణీయుడు

భవానీపురం(విజయవాడపశ్చిమ): మూడుసార్లు విజయవాడ పార్లమెంట్ సభ్యుడిగా, పదేళ్లపాటు కేంద్ర నీటిపారుదల, విద్యుత్ శాఖ మంత్రిగా పని చేసి అనేక భారీ ఆనకట్టల రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన డాక్టర్ కానూరు లక్ష్మణరావు (కేఎల్‌రావు) చిరస్మరణీయుడని పలువురు వక్తలు తెలిపారు. ప్రముఖ ఇంజినీర్, పద్మభూషణ్ డాక్టర్ కేఎల్ రావు జయంతి సందర్భంగా చిట్టినగర్ 47వ డివిజన్‌లో ఆయన విగ్రహం వద్ద సోమవారం నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ గంగా, కావేరి నదులను అనుసంధానం చేసి లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించిన మహనీయుడు కేఎల్ రావు అని కొనియాడారు. పోతిన పైడారావు, డి.వెంకట రమణ, వరకాల జోషి, నన్నం దుర్గ, మద్దిరాల కమలాకర్, శివ, పద్మ, శ్రీరాములు పాల్గొన్నారు.

• పల్లపు ప్రాంతాలు జలమయం


జెడ్పీ బాలుర హైస్కూల్ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు


ఎర్రకాలువలో నీటి ప్రవాహానికి అడ్డుపడుతున్న వ్యర్థాలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

జగ్గయ్యపేట అర్బన్: రెండురోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జగ్గయ్యపేట పట్టణంలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. డ్రెయిన్లు పొంగి అనేక చోట్ల రోడ్లపైకి నీరు చేరడంతో వాహనచోదకులు, పట్టణ ప్రజలు ఇబ్బందిపడ్డారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ రోడ్డు, ఫైర్ ఆఫీసు రోడ్డు, సబ్‌జైల్ రోడ్లు జలయమయ్యాయి. ఈ ప్రాంతాలు పల్లంగా ఉండటంతో కొద్దిపాటి వర్షానికే రోడ్డుపై నీరుచేరింది. పట్టణ నడిబొడ్డున ఉన్న ఎర్రకాలువ కూడ పొంగడంతో కాలువ కట్టమీద ఉన్న గృహాలలోకి నీరుచేయడంతో ఆయా గృహాలవారు అవస్థలుపడ్డారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య చర్యలు


డ్రెయిన్లలో చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

జగ్గయ్యపేట అర్బన్: వర్షాలు పడుతుండటంతోపాటు ఇటీవల పట్టణంలో డయేరియా వ్యాధి విజృంభించిన నేపథ్యంలో మున్సిపల్ యంత్రాంగం జగ్గయ్యపేటలో ముమ్మరంగా పారిశుద్ధ్య చర్యలు చేపట్టింది. పట్టణంలోని కోదాడ రోడ్డు, విజయవాడ రోడ్డు, ముక్త్యాల రోడ్డు తదితర ప్రధాన వీధులకు అనుసంధానంగా ఉన్న డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపట్టారు. పట్టణ ప్రజలకు తాగునీరు అందించే ట్యాంకులను కూడా శుభ్రపరిచారు. పారిశుద్ధ్య పనులను శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, సచివాలయ శానిటరీ సెక్రటరీలతో కలిసి పర్యవేక్షిస్తున్నారు. వార్డుల్లో హెల్త్ సెక్రటరీలు, ఆరోగ్య సిబ్బందితో కలిసి ఇంటింటి సర్వే చేపట్టి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ దోమలు నివారణ కోసం స్ప్రేయింగ్, ఫాగింగ్, బ్లీచింగ్ చేయిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని ఐదోవార్డులో జ్వరంతో బాధపడుతున్న ఐదుగురిని ఏఎన్‌ఎంలు గుర్తించగా, వారికి వైద్యం అందించినట్లు వివరించారు.